పారదర్శకంగా 'భూ భారతి' అమలు చేస్తాం

సైదాపూర్: భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి/ సైదాపూర్, ఏప్రిల్ 29: ఆర్‌వోఆర్- 2025 భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా అమలు చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో, సైదాపూర్ మండలకేంద్రంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జూన్ 2 నుంచి అమల్లోకి వచ్చే ఈ చట్టం ద్వారా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. భూమికి భూధార్ సంఖ్య కేటాయిస్తామని తెలిపారు. అంతకు ముందు సైదాపూర్ మండలం పెర్కపల్లిలో బ్రిడ్జి పనులు, మండలకేంద్రంలోని వెన్కేపల్లి-సైదాపూర్ సహకార సంఘం నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. కాగా, చిగురుమామిడిలో ప్రభుత్వ కార్యక్రమంలో కొందరు అనధికార వ్యక్తులు సభా వేదికపై కూర్చోవడంపై రైతులతో పాటు కాంగ్రెస్ నాయకులు సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్లు రమేశ్, మంజుల, ఎంపీడీవోలు మధుసూదన్, యాదగిరి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, సైదాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, వెన్కేపల్లి-సైదాపూర్ సహకార సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ శ్రీపతి రవీందర్ గౌడ్, వెన్నంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి, సైదాపూర్ మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, చిగురుమామిడి మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, కాంగ్రెస్ మహిళా మండలాధ్యక్షురాలు పోలు స్వప్న, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఇష్టారాజ్యంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం'

శంకరపట్నం, ఏప్రిల్ 29: ఇందిరమ్మ ఇండ్ల పథకం కాంగ్రెస్ పార్టీ ఇష్టారాజ్యంగా మారిందని బీజేపీ నాయకులు దుయ్యబట్టారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలి సమ్మిరెడ్డి, మండలాధ్యక్షుడు ఎనుగుల అనిల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీది ప్రజా పాలన కాదు.. అప్రజాస్వామిక పాలన.. అని విమర్శించారు. పేద ప్రజలకే పథకాలు అంటూ ఊదరగొట్టిన నాయకులు పక్షపాతం చూపుతున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొలంగూర్, కేశవపట్నం, మెట్‌పల్లి, తదితర గ్రామాల్లో నిజమైన పేదలకు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపిక కమిటీ సభ్యులు అర్హులను పక్కన పెట్టి అనర్హులైన వారికి, తమ పార్టీ వారికి ఎంపిక జాబితాల్లో చోటు కల్పించారన్నారు. కొలతల్లో తేడాల సాకుతో కొర్రీలు పెడుతూ సామాన్యులకు ఇండ్లను దూరం చేయడం సరికాదన్నారు. అర్హులకు న్యాయం జరుగకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు, సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సాధారణ కాన్పులను ప్రోత్సహించాలి

విద్యానగర్, ఏప్రిల్ 29: సాధారణ కాన్పులను ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి కాన్పు సాధారణ ప్రసవమయ్యేలా చూడాలన్నారు. ఆరోగ్య మహిళా వైద్య శిబిరాల్లో మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సన జవేరియా, విప్లవశ్రీ, రాజగోపాల్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 29: ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూలీలకు అలవెన్స్ ఇవ్వడం లేదన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండే ఏప్రిల్‌లో 35 శాతం, మేలో 45 శాతం వేసవి అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉపాధి పనులకు కత్తెర

- పనిదినాల్లో సగానికి పైగా కోత
- జిల్లాకు 14.15లక్షల పనిదినాల కేటాయింపు
- పథకం నిర్వీర్యానికి కొనసాగుతున్న కుట్ర
- ఇవి ఏమూలకూ సరిపోవంటూ అధికారుల పెదవి విరుపు
- కేంద్రం తీరుతో కూలీల్లో తీవ్ర ఆందోళన

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే పరంపర కొనసాగుతూనే ఉన్నది. ఇప్పటికే ఏటేటా చేపట్టాల్సిన పనుల సంఖ్య కుదించడంతో పాటు, కూలీలకు పనులు కల్పించేందుకు నవా లక్ష నిబంధనలు అమల్లోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా వారికి పని దినాల కల్పనలో కూడా భారీగా కోత విధించింది. దీంతో, జిల్లాలో గతేడాది కంటే సగం పని దినాలు తగ్గగా, ఈ ఆర్థిక సంవత్సరంలో జాబ్‌కార్డులున్న కూలీలందరికీ పని కల్పించడం గగనమే అవుతుందనే చర్చ అధికార వర్గాల్లో కొనసాగుతున్నది.

చిగురుమామిడి మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కలెక్టరేట్, ఏప్రిల్ 29: కూలీలకు పనిదినాల కల్పనలో రాష్ట్ర వ్యాప్తంగా కోత విధించిన నేపథ్యంలో జిల్లాకు గతేడాది కేటాయించిన పనిదినాల్లో సగానికి మాత్రమే అనుమతిస్తూ, కేంద్రం ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 28లక్షల35వేల పనిదినాలకు అనుమతించగా, 29.57లక్షల పనిదినాలు నమోదయ్యాయి. 104శాతం లక్ష్యాన్ని సాధించగా, 92,163 మంది కూలీలు పని దినాలను సద్వినియోగం చేసుకున్నారు. లక్ష్యానికి మించి పనులు కల్పిస్తున్న నేపథ్యంలో ఈసారి పనిదినాలు పెంచుతారనే ఆశతో కూలీలు, అధికారులు ఉన్నారు. అయితే, అందరి అంచనాలు తలకిందులు చేస్తూ కేంద్రం పనిదినాలకు భారీ సంఖ్యలో కత్తెర పెట్టడంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. తాము విడుదల చేసిన మార్గదర్శకాలకనుగుణంగా పనులు జరుగడం లేదనే సాకుతో పనిదినాలు తగ్గిస్తుండగా, జిల్లాలో లక్షకు పైగా ఉన్న క్రియాశీల కార్యకర్తలకు ఈసారి పూర్తిస్థాయిలో ఉపాధి లభిస్తుందా? లేదా అనే అయోమయం అటు అధికారులు, ఇటు కూలీల్లో నెలకొన్నది.

రెండు నెలల్లోనే సగానికి పైగా పూర్తి చేసేలా లక్ష్యం

ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు కేటాయించిన పనిదినాల్లో ఏప్రిల్‌లో 4.5లక్షలు, మేలో 5లక్షల పనిదినాలు కూలీలకు కల్పించాలని లక్ష్యం నిర్దేశించారు. వ్యవసాయ పనులు కూడా లేకపోవడంతో ఈరెండు నెలల్లో కూలీలు అధికంగానే వచ్చే అవకాశాలుండగా, ఫామ్‌పాండ్‌ల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా వాటినే కొనసాగిస్తూ, కూలీలకు పని కల్పించనున్నారు. జూన్ నుంచి వ్యవసాయ పనులు మొదలు కానుండగా, మిగతా పనిదినాలు మరో నాలుగైదు నెలల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం చేరుకునే అవకాశమున్నది. ఆ తర్వాత మిగతా నెలల్లో ఉపాధి పనులకు విరామం ప్రకటిస్తారా? లేక సర్దుబాటు చేసి పనులు కల్పిస్తారా? అనే సంశయం అధికార వర్గాలతో పాటు కూలీల్లో కూడా వ్యక్తమవుతోంది. గతంలో లక్ష్యానికి మించి కూలీలు హాజరైతే పనిదినాల్లో కొంత సర్దుబాటు చేసి అందరికీ పనులు కల్పించే అవకాశముండేది. కానీ, ఈ ఏడాది మాత్రం నిర్దేశించిన మేరకు మించి ఎట్టిపరిస్థితుల్లో పనులు చేయించొద్దని కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అధికారులకు అందినట్లు తెలుస్తున్నది. ఈక్రమంలో కూలీల డిమాండ్‌ను బట్టి పనిదినాలు కల్పించడం కాకుండా, ఉన్న పనిదినాలకు అనుగుణంగా కూలీలకు పనులు సూచిస్తూ, కొనసాగించాలని కేంద్రం విడుదల చేసిన ఆదేశాలు వెల్లడిస్తున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో, జిల్లాలో ఉపాధి ఆధారిత పనిదినాలు తగ్గుతాయని, ఈ ప్రభావం కూలీలపై పడే ప్రమాదం మెండుగా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

పనిదినాలు తగ్గాయి

గతేడాది ఉపాధి హామీ పథకం కింద 29.57లక్షల పనిదినాలు నమోదయ్యాయి. ఈసారి జిలాలకు 14.17లక్షలు మాత్రమే కేటాయించారు. సగానికి సగం పనిదినాలు తగ్గడంతో, రాబోయే నాలుగైదు నెలల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం చేరుకుంటాం. అనంతరం ప్రభుత్వ నిర్ణయంపై పనిదినాల కల్పన ఆధారపడి ఉంటుంది.

-వేణుగోపాల్, జిల్లాగ్రామీణాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి అధికారి

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 29: కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ప్రజా మిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. నగరంలోని ఫ్రంట్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించి మావోయిస్టులతో చర్చలు జరుపాలన్నారు. సమావేశంలో ఫ్రంట్ సభ్యులు రవీందర్, శ్రీరాములు, కిషన్, రాజేందర్, నరేందర్ పాల్గొన్నారు.

నేడు పౌరహక్కుల దినోత్సవం

కలెక్టరేట్, ఏప్రిల్ 29: అనుసూచిత కులాలు, జనజాతులపై జరిగే అవాంఛనీయ ఘటనల నివారణ కోసం ప్రతి నెలా 30న నిర్వహించే పౌరహక్కుల దినోత్సవం బుధవారం మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో జరుపనున్నట్లు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఇన్‌చార్జి ఉపసంచాలకుడు పవన్‌కుమార్ తెలిపారు. కొత్తపల్లి మండలంలోని చింతకుంట, కరీంనగర్ రూరల్ - ఇరుకుల్ల, మానకొండూర్- ఊటూర్, తిమ్మాపూర్- ఇందిరానగర్, గన్నేరువరం- జంగపల్లి, గంగాధర- ముప్పిడినర్సయ్యపల్లి, రామడుగు-కిష్టాపూర్, చొప్పదండి-మంగలపల్లి, చిగురుమామిడి-సీతారాంపూర్, వీణవంక-దేశాయిపల్లి, వెన్కెపల్లి సైదాపూర్-పెర్కపల్లి, శంకరపట్నం- మక్త, హుజూరాబాద్-కందుగుల, జమ్మికుంట-మాచనపల్లి, ఇల్లందకుంట-కనగర్తి గ్రామాల్లో ఆయా మండలాల తహసీల్దార్లు, పోలీస్ సిబ్బంది, ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ అధికారుల ఆధ్వర్యంలో సమావేశాలు జరుగనున్నట్లు, మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

12 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

డీవైఎస్‌వో, ఒలింపిక్ సంఘ ప్రతినిధులతో సమావేశమైన నగరపాలక సంస్థ కమిషనర్

కార్పొరేషన్/కొత్తపల్లి, ఏప్రిల్ 29: కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జిల్లా యువజన క్రీడాశాఖ సహకారంతో మే 12 నుంచి ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. సమ్మర్ క్యాంప్ నిర్వహణపై మంగళవారం సాయంత్రం కమిషనర్ అధ్యక్షతన నగరపాలక సంస్థ కార్యాలయంలో డీవైఎస్‌వో, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో మే 12 నుంచి జూన్ 10 వరకు కొనసాగుతాయన్నారు. వీటిలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, క్రికెట్, చెస్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, ఖోఖో, కబడ్డీ, కరాటే, సాఫ్ట్ బాల్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్ క్రీడలపై 4 నుంచి 12వ తరగతి లోపు విద్యార్థినీ విద్యార్థులకు క్రీడా శాఖ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సహకారంతో నెలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థుల నుంచి మే 2 నుంచి 9 వరకు అంబేద్కర్ స్టేడియంలో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి. శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నందేల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి బి. వేణుగోపాల్, పెటా సంఘాల నాయకులు బాబు శ్రీనివాస్, అంతటి శంకరయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

చొప్పదండి, ఏప్రిల్ 29: ఆర్నకొండ గ్రామంలో గ్రామస్తులందరూ కలిసి స్థానిక బస్‌స్టాప్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రయాణికుల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

'కేబుల్ బ్రిడ్జి లైటింగ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలి'

కార్పొరేషన్, ఏప్రిల్ 29: నగరంలో రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించిన కేబుల్‌బ్రిడ్జిపై వాహనదారులు, పాదచారులు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని, వెంటనే డైనమిక్ లైట్స్ విషయంలో చర్యలు తీసుకోవాలని మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా విన్నవించారు. ఈ బ్రిడ్జిపైన వేసిన రోడ్డు పూర్తిగా పెచ్చులుగా ఊడి పోవడంతో తొలగించారని, అలాగే రూ.6.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన డైనమిక్ లైట్స్ వెలుగక బ్రిడ్జి కళావిహీనంగా మారిందన్నారు. దీనికి కారణమైన ఆర్ అండ్ బీ అధికారులు, డైనమిక్ లైటింగ్ ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నీట్ పకడ్బందీగా నిర్వహించాలి

మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ అధికారి వెంకటేశ్వర్లు

విద్యానగర్, ఏప్రిల్ 29: వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం మే 4న జరిగే నీట్ కోసం జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని డీఆర్‌వో వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నీట్ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నీట్ రాసే 2975 మంది విద్యార్థుల కోసం ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కాకుండా జాగ్రత్త వహించాలని, అలాగే సీసీటీవీ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి పరీక్షను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నీట్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. ఈ సమావేశంలో నీట్ పరీక్ష జిల్లా కోఆర్డినేటర్ పంకజ్ కుమార్, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి పవన్ కుమార్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఎంపీడీసీఎల్ ఏడీఈ లావణ్య, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఏసీపీ మాధవి, అగ్నిమాపక డీఎఫ్‌వో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Anjamma Boddu D/o Narsaiah (Old name), H.No. 11-6-92, Sundaraiahnagar, town&mandal Sircilla, Rajanna Sircilla. My name is going to be changed as Anjali Boddu W/o Bandameedi Narsimlu (New Name)
NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

పెన్షనర్ల ధర్నాకు భారీగా తరలిన విశ్రాంత ఉద్యోగులు

కలెక్టరేట్/హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 29 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ, తెలంగాణ ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ధర్నాకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున విశ్రాంత ఉద్యోగులు తరలివెళ్లారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో వందల మంది పెన్షనర్లు హాజరుకాగా, ఆసంఘం జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ జిల్లా నుంచి మాట్లాడారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేయడం సముచితం కాదన్నారు. ధర్నాకు హాజరైన వారిలో ఆ సంఘం జిల్లా ప్రతినిధులు గడ్డం అశోక్, బోంగోని వెంకటయ్య, చొల్లేటి మల్లారెడ్డి, దొంత హరికిషన్, కట్ట నాగభూషణాచారి, శనిగరం నరేందర్, చీకట్ల సమ్మయ్యతో పాటు 200 మంది పెన్షనర్లు ఉన్నారు.

పేద కుటుంబాలకు భరోసా కల్యాణలక్ష్మి

మధురానగర్‌లో లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, ఏప్రిల్ 29 : కల్యాణలక్ష్మి పథకం పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని ఆడ పిల్లల పెళ్లికి భరోసా కల్పిస్తున్నదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి పథకం చెక్కులు మంజూరు కాగా, మంగళవారం మండలంలోని మధురానగర్‌లో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి, కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ మైనార్టీ గెజిటెడ్ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 29 : ఇరిగేషన్ శాఖలో మైనార్టీ గెజిటెడ్ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, తెలంగాణ మైనార్టీ గెజిటెడ్ అధికారుల సంఘం కోరింది. నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(అడ్మిన్) మహ్మద్ అమ్జద్ హుస్సేన్‌ను ఆసంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో పలువురు ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. దీర్ఘకాలంగా ఆశాఖలో మైనార్టీ గెజిటెడ్ అధికారులు పడుతున్న ఇబ్బందులపై వివరించగా, వెంటనే స్పందించి, సమస్యలు పరిష్కరించేందుకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈఎన్‌సీని కలిసినవారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ రియాజ్ అలీ, ప్రధాన కార్యదర్శి ఎండి.దస్తగిరి, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రేష్మతబస్సుమ్, నాయకులు సిరాజ్, అయూబ్‌తో తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

గంగాధర, ఏప్రిల్ 29 : కురిక్యాల గ్రామానికి చెందిన ఒగ్గరి ప్రశాంత్ ఇటీవల కరెంట్ షాక్‌తో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మంగళవారం తెలంగాణ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గె మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం పరామర్శించారు. సంఘం తరపున రూ.50 వేలు, అలాగే, ఎగ్గె మల్లేశం రూ.10 వేలు, క్యామ మల్లేశం రూ.5 వేల చొప్పున సాయం అందజేశారు. ఇక్కడ ఒగ్గుబీర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒగ్గు రవి, కార్యదర్శి ఒగ్గు మధు, ప్రచార కార్యదర్శి ఈర్ల మహిపాల్, సలహాదారు సాయిల్ల మల్లేశం, జిల్లా అధ్యక్షుడు ఒగ్గరి రాజు, ప్రధాన కార్యదర్శి పుల్ల కనకయ్య, ఒగ్గరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వీణవంక, ఏప్రిల్ 29: మండల కేంద్రానికి చెందిన సమిల్ల రామవ్వ అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి మాలసంఘం ఆధ్వర్యంలో రూ.10 వేల సాయం అందజేశారు. ఇక్కడ సంఘం గ్రామాధ్యక్షుడు వోరెం రవీందర్, సభ్యులు ఉన్నారు.

గౌరవ వేతనం ఇప్పించండి

- నగరపాలక సంస్థ కమిషనర్‌కు ప్రైవేటు పీఈటీల సంఘం వినతి

కొత్తపల్లి, ఏప్రిల్ 29: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 2023లో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో శిక్షణలు ఇచ్చిన కోచ్‌లకు గౌరవ వేతనం మంజూరు చేయాలని మంగళవారం జిల్లా ప్రైవేటు పీఈటీల సంఘం ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రాన్ని అందించారు. సుమారు 3500 మంది చిన్నారులకు క్రీడా శిక్షణలు ఇచ్చిన కోచ్‌లకు ఇప్పటి వరకు గౌరవ వేతనం అందలేదని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ పీఈటీల సంఘం అధ్యక్ష కార్యదర్శులు బత్తిని శ్రీధర్‌గౌడ్, దారం గౌతమ్‌రెడ్డి, కోశాధికారి కంకటి అనూప్‌కుమార్, ముఖ్య సలహాదారులు సిలివేరి మహేందర్, ఉపాధ్యక్షుడు కొరిమి సంతోష్, మహిళా విభాగం కన్వీనర్ పుష్పలత, సంఘం బాధ్యులు రవి, శివ, అభిషేక్, అనూష్, శ్రీధర్, రాకేశ్ రెడ్డి, చందు, మహేందర్ పాల్గొన్నారు.

'శిక్షణ'తో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

జమ్మికుంట, ఏప్రిల్ 29: శిక్షణలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దోహదపడతాయని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్ పేర్కొన్నారు. కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు గత రెండు నెలలుగా కంప్యూటర్ కోర్సులో శిక్షణ అందించగా, శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

వికాస్‌రెడ్డి(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్ 29: విద్యుత్‌షాక్‌కు గురై ఓ విద్యార్థి మృతి చెందాడు. ఎల్ఎండీ పోలీసులు, తోటి విద్యార్థుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ల్యాగలమర్రి గ్రామానికి చెందిన వికాస్ రెడ్డి(23) మండల కేంద్రంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆర్టీవో కార్యాలయ సమీపంలో ఉన్న శ్రీ రామ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ రోజూ కళాశాలకు వెళ్లి వస్తాడు. ఈ క్రమంలో హాస్టల్ భవనం పక్కన ఒక చెట్టు ఉండడంతో మంగళవారం సాయంత్రం దాన్ని కొట్టాలని హాస్టల్ ఓనర్ సంతోష్‌రావు పురమాయించడంతో చెట్టు ఎక్కాడు. కొమ్మలను నరుకుతుండగా, ఒక కొమ్మ విరిగి కింద ఉన్న 11కేవీ విద్యుత్ తీగలపై పడడంతో చెట్టుకు విద్యుత్‌ప్రసరణ జరిగి వికాస్‌రెడ్డి షాక్‌కు గురయ్యాడు. కింద ఉన్న సంతోష్‌రావుకు సైతం స్వల్పంగా షాక్ రాగా, కేకలు వేయడంతో హాస్టల్‌లో ఉన్న మిగతా విద్యార్థులు వచ్చి అతడిని కాపాడారు. వికాస్‌రెడ్డి చెట్టుపై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎల్ఎండీ ఎస్ఐ వివేక్, సిబ్బంది నరేశ్, లక్ష్మీనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లా జడ్జిని కలిసిన ప్రాసిక్యూటర్లు

జిల్లా జడ్జికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రాసి